సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 9 । జనవరి । 2024



టమాట కిలో రూ.15

కక్కలపల్లి మండీలో సోమవారం టమాట కిలో గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.6. సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



నాణ్యమైన విద్యుత్ సరఫరా

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఈ క్రమంలో విరివిగా సబ్‌స్టేషన్లు నిర్మిస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి అన్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
29.3°/19.5°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత బాగా పెరిగింది. పగలంతా ఆకాశం మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

11 నుంచి గ్యాస్ట్రో ఎంటరాలజీ సేవలు



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఈ నెల 11 నుంచి గ్యాస్ట్రో ఎంటరాలజీ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి. గతేడాది డిసెంబర్‌లో గ్యాస్ట్రో ఎంటలరాలజీ విభాగానికి ప్రభుత్వం వైద్యులను నియమించింది. పలువురు వైద్యులు విధుల్లోకి చేరారు. గురువారం నుంచి సేవలు ప్రారంభమవుతాయని బోధనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రతి సోమ, గురువారం గ్యాస్ట్రో ఎంటరాలజీ సేవలు ఉంటాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే ప్రతి సోమ, గురువారాల్లో న్యూరో, మంగళ, శుక్రవారాల్లో కార్డియాలజీ, న్యూరాలజీ, బుధ, శనివారాల్లో మెడికల్ గ్యాస్ట్రో, నెఫ్రాలజీ, ఎండోక్రైనాలజీ ఓపీ సేవలు అందుతున్నాయని వివరించారు.

26 మంది ఎస్‌ఐల బదిలీ

పుట్టపర్తి టౌన్: ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో వివిధ స్టేషన్లలో పనిచేస్తున్న 26 మంది ఎస్‌ఐలను తిరుపతి, చిత్తూరు జిల్లాలకు బదిలీ చేస్తూ సోమవారం ఎస్పీ మాధవరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఎస్‌ఐలలో డి.శేషగిరి, ఏ. వెంకటనారాయణ, ఎస్.వెంకటరాముడు, జి.రామచంద్రయ్య, జి.ఇక్బాల్, కె.మహమ్మద్ రఫీ, ఎస్.ఇషాక్‌బాషా, జి.హనుమంత్‌రెడ్డి, సి.బాబు, డి.లక్ష్మీనారాయణ, ఎస్.జయరామప్ప, బి.భాస్కర్ ప్రసాద్‌రాజు, కె.ఎల్.కళావతి, ఎ.అబ్దుల్ కలామ్ ఆజాద్, ఎస్.మహమ్మద్ రఫీ, కె.రెడ్డెప్ప, పి.వెంకట రమణ, కె.ఆంజనేయ ప్రసాద్, కె.శివశంకర్, బి.తులశన్న, జి.బాలరాజు, కె.శ్రీరాములు, జి.వెంకట రమణ, ఎస్.ఏ.రఫీక్, పి.శ్రీనివాసులు, ఏ.దాదాపీర్ ఉన్నారు. వీరంతా మంగళవారం రిలీవ్ కానున్నారు.

హత్య కేసులో నలుగురికి యావజ్జీవం



అనంతపురం: హత్య కేసులో నలుగురు ముద్దాయిలకు యావజ్జీవ కారాగార శిక్ష పడింది. వివరాలిలా ఉన్నాయి. శింగనమల మండలం ఉల్లికల్లు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన పాలాకుల ఆదినారాయణ కుటుంబం 2018 ఫిబ్రవరి 11న పొరుగున ఉన్న పెద్దనాన్న కుళ్లాయప్ప కుటుంబంతో మురికినీటి కాలువ, ఇంటిముందు పేడ అలికే విషయమై గొడవపడింది. మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తులైన కుళ్లాయప్ప కొడుకులు పాలాకుల సూర్యనారాయణ, పాలాకుల పెద్దన్న, పాలాకుల రామాంజనేయులు, కూతురు కొండాపురం రామాంజినమ్మ కట్టెలు, కొడవండ్లతో విరుచుకుపడ్డారు. ఆదినారాయణ తమ్ముడు చిన్న చౌడప్పను గొంతుకోసి చంపారు. ఆదినారాయణ ఫిర్యాదు మేరకు ఐదుగురు నిందితులపై శింగనమల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. జిల్లా కోర్టు జడ్జి శ్రీనివాస్ 10 మంది సాక్షులను విచారించారు. హత్యానేరం రుజువు కావడంతో పాలాకుల సూర్యనారాయణ (ఏ1), పాలాకుల పెద్దన్న (ఏ2), పాలాకుల రామాంజినేయులు (ఏ3), కొండాపురం రామాంజినమ్మ (ఏ5)లకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.42 వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. ఏ4 అయిన కుళ్లాయప్ప భార్య సాలమ్మపై నేరం రుజువు కానందున ఆమెపై కేసు కొట్టివేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరినాథరెడ్డి వాదించారు. ముద్దాయిలకు శిక్ష పడేలా వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

కప్పేసిన పొగమంచు

- శీతలగాలులతో జనం ఉక్కిరిబిక్కిరి

అనంతపురం అగ్రికల్చర్: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా వాతావరణం మారింది. సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పగలంతా ఆకాశం మేఘావృతమైంది. భానుడు కనిపించకుండా పొగమంచు పూర్తిగా కప్పేసింది. శీతల గాలులు, చలితీవ్రత వల్ల జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గాలివేగం స్వల్పంగా పెరగడం, ఆకాశం మేఘావృతం కావడంతో రాత్రింబవళ్లు చలి వాతావరణం నెలకొంది.

మద్దతివ్వండి.. మంచి చేస్తాం



వైఎస్సార్ సీపీ హిందూపురం అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తలు టీఎన్ దీపిక, బోయ శాంతమ్మలకు మద్దతు ఇవ్వాలని కోరుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



చౌళూరు సభకు హాజరైన ప్రజలు

- మోసకారి చంద్రబాబు మాటలు నమ్మకండి
- వైఎస్సార్ సీపీ అభ్యర్థులను పెద్దమనసుతో ఆదరించండి
- హిందూపురం ప్రజలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు
- నియోజకవర్గంలో విస్తృత పర్యటన

హిందూపురం: ''ఇక్కడి నుంచి టీడీపీ అభ్యర్థిని అసెంబ్లీకి పంపారు. ఏం అభివృద్ధి జరిగిందో మీరంతా చూశారు. ఈసారి స్థానికురాలైన బీసీ సామాజికవర్గానికి చెందిన మీ ఆడపడుచుకు మేం అవకాశం ఇస్తున్నాం. మీ మద్దతు ఇవ్వండి. తప్పకుండా మంచి చేసి చూపిస్తాం'' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బోయ శాంతమ్మలతో కలిసి హిందూపురం మండలంలోని చౌళూరు, తూమకుంట, గోళాపురం, సంతేబిదనూర్, కొటిపి, కిరికెర, బేవనహళ్లి గ్రామపంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో మాట్లాడారు. మాట ఇస్తే మంచి చేసి చూపే నైజం వైఎస్ జగన్‌దైతే.. నమ్మించి గొంతు కోయడం చంద్రబాబుకు అలవాటన్నారు. టీడీపీ హయాంలో ఇళ్లు, పింఛన్లు కేవలం జన్మభూమి కమిటీ సిఫారసు చేసిన పచ్చచొక్కాలకే దక్కాయన్నారు. కానీ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అర్హతే ఆధారంగా ఇంటి ముంగిటకే పథకాలు చేరుతున్నాయన్నారు. అన్ని పథకాలు, పదవుల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. మోసకారి చంద్రబాబు మళ్లీ మీ ముందుకు వస్తున్నారని, అతన్ని నమ్మితే నట్టేట మునగడం ఖాయమన్నారు.

జగన్‌తోనే బడుగులకు పెద్దపీట..

వైఎస్సార్ సీపీ హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక, పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ మాట్లాడుతూ...వైఎస్ జగన్ హయాంలోనే బడుగు, బలహీన వర్గాలకు మేలు జరుగుతోందన్నారు. ఎన్నికల వేళ అరచేతిలో వైకుంఠం చూపడానికి టీడీపీ నాయకులు మళ్లీ మీ ముందుకు వస్తున్నారని, జాగ్రత్తగా ఉండాలన్నారు. రెండుసార్లు హిందూపురం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన బాలకృష్ణను ఈప్రాంత వాసులంతా సినిమాల్లోనే చూసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఆరునెలలకోసారి ఆయన హిందూపురం వచ్చినా పెళ్లిళ్లు, గృహప్రవేశాల్లో తప్ప ప్రజల మధ్య ఏనాడూ కనిపించడన్నారు. హిందూపురానికి మంచి జరగాలంటే అందుబాటులో ఉంటూ సేవచేసే వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, చౌళూరు మధుమతిరెడ్డి, చౌళూరు రామకృష్ణారెడ్డి సతీమణి జ్యోత్స్న, కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని మాట్లాడారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, గుడ్డంపల్లి వేణురెడ్డి, ఎంపీపీ రత్నమ్మ, జెడ్పీటీసీ నాగభూషణం, మున్సిపల్ వైస్ చైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీనేత జనార్దన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పురం' టీడీపీ కంచుకోట కాదు.. అద్దాలమేడ

'టీడీపీ చెప్పుకుంటున్నట్లు హిందూపురం కంచుకోట కాదు.. ఇది అద్దాల మేడ. రాయి ఎక్కడి నుంచి వేసినా అది పగిలి ముక్కలవ్వాల్సిందే! అది చూపించబోతున్నాం' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. హిందూపురంలో టీడీపీ గెలుస్తూ వచ్చినా అభివృద్ధి ఏమీ చేయలేదని విమర్శించారు. చంద్రబాబుతో పనిలేదని, బాలయ్య అయినా, ఆయన అల్లుడైనా టీడీపీ తరఫున ఎవరు పోటీచేసినా ఓటమి ఖాయమన్నారు.



గజమాలతో మంత్రి, సమన్వయకర్తలను ఆహ్వానిస్తున్న దృశ్యం

'స్వీప్' ద్వారా ప్రచారాన్ని ముమ్మరం చేయండి



ఓటింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ డీఆర్‌ఓ

పుట్టపర్తి అర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు పాత్రపై అవగాహన కల్పించడంతో పాటు ఓటరును చైతన్యపరిచేందుకు 'స్వీప్' ద్వారా ప్రచారం ముమ్మరం చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన స్వీప్ కేంద్రాన్ని జేసీ ప్రారంభించి ఈవీఎం పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరినీ పోలింగ్ కేంద్రం వరకూ తీసుకెళ్లి ఓటింగ్‌లో పాల్గొనేలా అవగాహన కల్పించడమే 'స్వీప్' కార్యక్రమ ఉద్దేశమన్నారు. కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ద్వారా ఎలా ఓటు వేయాలి, ఓటు నమోదైన విషయాన్ని ఎలా తెలుసుకోవాలి అనే దానిపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలోని 32 మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల వద్ద 'స్వీప్' కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, స్వీప్ నోడల్ ఆఫీసర్ శివరంగ ప్రసాద్, ఎన్నికల డీటీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండపై మన జెండా ఎగరాలి



మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్, చిత్రంలో ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ



ఆత్మీయ సమావేశానికి తరలివచ్చిన నాయకులు

- కార్యకర్తలంతా ఉషశ్రీ చరణ్‌కు అండగా నిలవాలి
- మాజీ మంత్రి శంకరనారాయణ పిలుపు
- మద్దతివ్వండి.. మీ ముందుండి పోరాడతా
- పెనుకొండ కేడర్‌కు మంత్రి ఉషశ్రీచరణ్ హామీ

పెనుకొండ: ''ఎమ్మెల్యేగా ఎవరు నిల్చున్నా మన అజెండా మాత్రం మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చూడాలన్నదే కావాలి. పెనుకొండపై మన పార్టీ జెండా మళ్లీ ఎగరాలి. ఇందుకోసం కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలి. నన్ను ఆదరించినట్లే ఉషశ్రీ చరణ్‌నూ ఆదరించండి. ఆమె తప్పక అండగా ఉంటుంది'' అని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన తన స్వగృహంలో నియోజకవర్గ సమన్వయకర్త, మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్సీ మంగమ్మతో కలిసి కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ, పదేళ్లుగా కార్యకర్తలు, నాయకులు, ప్రజలు తనను ఎంతో ఆదరించారని, వారికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ అధిష్టానం కొన్ని నిర్ణయాలు తీసుకుందని, అందులో భాగంగానే తనను అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్తగా, మంత్రి ఉషశ్రీచరణ్‌ను పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా సీఎం జగన్ నియమించారన్నారు. అందువల్ల కార్యకర్తలంతా ఇన్నాళ్లు తనపై చూపిన ప్రేమ, అనురాగం, ఆప్యాయత, ఆదరణను ఉషమ్మ పట్ల చూపాలని కోరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలంటే పార్టీ శ్రేణులంతా ఒక్కమాటపై నిలబడి కష్టపడాలన్నారు. పెనుకొండలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి జగనన్నకు కానుకగా ఇవ్వాలన్నారు.

ఆదరించండి... అండగా ఉంటా

మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ, ఇన్నాళ్లు శంకరనారాయణపై చూపిన ప్రేమానురాగాలు తనపై కూడా చూపాలని కోరారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తప్పక అండగా ఉంటానన్నారు. పార్టీలోని ప్రతి ఒక్కరినీ కలుపుకుని ముందుకు సాగుతానన్నారు. 'వైనాట్ 175' నినాదంలో భాగంగా పెనుకొండ కోటపై మరోసారి వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి ఆ విజయాన్ని ముఖ్యమంత్రికి బహుమతిగా ఇద్దామన్నారు. ఇందుకోసం అందరం కలసి కట్టుగా పని చేద్దామని, నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ ప్రతి గడపకు వెళదామని పిలుపునిచ్చారు. ఇక వైఎస్సార్ సీపీ కార్యకర్తల జోలికి రావాలంటే ముందు తనను దాటి రావాలని, అందుకు సిద్ధమైతే రావాలని ప్రతిపక్ష పార్టీని హెచ్చరించారు. ఎమ్మెల్సీ మంగమ్మ మాట్లాడుతూ, 2019 ఎన్నికలను స్ఫూర్తిగా తీసుకుని మరింత ఉత్సాహంతో 2024 ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులను కోరారు. కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా మంత్రి ఉషశ్రీచరణ్, తాను, శంకరన్న అందుబాటులో ఉంటామన్నారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే శంకరనారాయణ నియోజకవర్గానికి చెందిన నాయకులు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులను మంత్రి ఉషశ్రీ చరణ్‌కు పరిచయం చేశారు. సమావేశంలో రాష్ట్ర వాల్మీకి, బోయ కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, పెనుకొండ నగర పంచాయతీ చైర్మన్ ఉమర్ ఫారూక్‌ఖాన్, ఎంపీపీ చంద్రశేఖర్, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ నారాయణరెడ్డి, నాయకులు వేణు, నేమతుల్లా, రఘునాథరెడ్డి, ప్రభు, వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

'స్పందన'పై నమ్మకం కలిగించాలి

- అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి
- అధికారులకు జాయింట్ కలెక్టర్ అభిషేక్ ఆదేశం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ

పుట్టపర్తి అర్బన్: 'ప్రజలు ఎంతో నమ్మకంతో జిల్లా నలుమూలల నుంచి కలెక్టరేట్‌కు వచ్చి స్పందన కార్యక్రమంలో అర్జీలిస్తున్నారు. అధికారులు బాధ్యతతో పనిచేసి వారి నమ్మకాన్ని నిలబెట్టాలి. స్పందనపై నమ్మకం కలిగించాలి. అందిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలి'' అని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం, స్పందన' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గత రెండు సోమవారాలు క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు రావడంతో స్పందన కార్యక్రమం నిర్వహించకపోవడంతో ఈ సోమవారం ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో జేసీతో పాటు డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, వార్డు/గ్రామ సచివాలయాల జిల్లా నోడల్ ఆఫీసర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు 318 అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్‌కుమార్ మాట్లాడుతూ, సమస్య మండల స్థాయిలో పరిష్కారం కాకపోవడంతోనే ప్రజలు జిల్లా స్థాయి స్పందన కార్యక్రమానికి వచ్చి అర్జీ ఇస్తున్నారని, దీన్ని గుర్తించి అధికారులు పనిచేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందితేనే మళ్లీ స్పందన రాడన్నారు. ఆ దిశగా అధికారులు ప్రయత్నించాలన్నారు. ఒక్క అర్జీ కూడా పెండింగ్‌లో లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రషీద్‌ఖాన్, సర్వే అండ్ ల్యాండ్స్ ఏడీ రామకృష్ణ, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్, డీపీఓ విజయ్‌కుమార్, పశుసంవర్ధక శాఖ అధికారి శుభదాస్, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మోహన్‌రాం, నిర్మలాజ్యోతి, సీపీఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో అందిన అర్జీల్లో కొన్ని...

- తన కుమారులు తనను పట్టించుకోవడం లేదని మడకశిర మండలం వడ్రెపాలెంకు చెందిన ఈశ్వరమ్మ జేసీ ఫిర్యాదు చేశారు. తనకు వడ్రెపాలెం సర్వే నంబర్ 401–1లో 0.38 ఎకరాలు, 642–1ఏబీలో 2.19 ఎకరాల భూమి ఉండేదని, ఆ భూములను తన ఇద్దరు కుమారులు పంచుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ఆ తర్వాత తనను పట్టించుకోలేదని తెలిపారు. వెంటనే ఆ భూముల రిజిస్ట్రేషన్ రద్దు చేసి తనకు న్యాయం చేయాలని కోరారు.
- 'జగనన్న సంపూర్ణ భూ హక్కు' పథకంలో సర్వే పూర్తయిన భూమిని ఆగస్టులో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నానని, అయితే ఈసీ రావడం లేదని పెనుకొండ మండలం గుట్టూరుకు చెందిన నారాయణస్వామి జేసీకి ఫిర్యాదు చేశారు. ఈసీ ఇప్పించి ఆదుకోవాలని కోరారు.
- గోరంట్ల మండలం మందలపల్లి గ్రామ సర్వే నంబర్ 657–1, 658–2లో ఉన్న 2.79, 4.69 ఎకరాల భూమికి సంబంధించిన విచారణ ఫైలు కలెక్టర్ కార్యాలయానికి 8 నెలల క్రితం వచ్చిందని మందలపల్లి నివాసి పెద్ద వెంకటరామప్ప కుమారుడు నారాయణప్ప తెలిపారు. అయితే అధికారులు ఇంతవరకూ ఎలాంటి నోటీసులు, విచారణ జరపలేదని జేసీ ఫిర్యాదు చేశారు. త్వరగా విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని విన్నవించారు.
- పరిగి మండలం ప్రసన్నాయపల్లిలోని గ్రామ కంఠం భూమిలో 45 ఏళ్ల నుంచి 38 కుటుంబాల వారు ఇళ్లు నిర్మించుకున్నామని, అయితే నేటికీ తమకు ఇంటి పట్టాలు మంజూరు చేయలేదని ఆ గ్రామస్తులు తెలిపారు. కనీసం ఇప్పటికైనా ఇంటి పట్టాలు మంజూరు చేసి హక్కులు కల్పించాలని జేసీని కోరారు.

అభ్యుదయ సాహిత్యానికి ప్రతీక అనంత

- నేడు తెలుగు భాషా వైభవ సదస్సు
- సాహితీ సేవకులకు పురస్కారాల ప్రదానం
- సాహితీ వేత్తలు, అభిమానులు తరలిరావాలి
- అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు



మాట్లాడుతున్న విజయబాబు, చిత్రంలో పీడీ నరసింహారెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్ / కల్చరల్: అభ్యుదయ సాహిత్యానికి ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రతీక అని అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ) ఆడిటోరియంలో మంగళవారం 'అనంత తెలుగు భాషా వైభవ సదస్సు' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన సోమవారం సాయంత్రం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో మీడియాకు వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో ఎంతోమంది సాహితీ రంగంలో సేవలందించారన్నారు. అలాంటి సాహితీ స్రష్టలు, విశిష్టమూర్తులను సదస్సులో ఘనంగా సత్కరించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా పది మందికి జీవన సాఫల్య సాహితీ పురస్కారాలు, మరో 40 మందికి తెలుగు భాషా సేవా ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. సదస్సు ఉదయం పది నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు ఉంటుందన్నారు. జిల్లా సంస్కృతిని చాటే కళా రూపాల ప్రదర్శన, సాంస్కృతిక సంబరాలు పెద్ద ఎత్తున జరుగుతాయన్నారు. భాషాభిమానులు, విద్యార్థులు, సాహితీవేత్తలు అందరూ తరలి వచ్చి సదస్సును విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా సీమ ఖ్యాతిని చాటే శ్రీకృష్ణదేవరాయలు వైభవాన్ని చాటే కళా రూపాన్ని సినీనటుడు కౌశిక్ బృందం ప్రదర్శిస్తుందన్నారు. అయితే ఇటువంటి మంచి కార్యక్రమాన్ని కూడా కొందరు తప్పు పడుతూ రాజకీయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరినీ విస్మరించడం లేదని, ఇప్పుడు అవకాశం రాని వారందరికీ త్వరలో రాష్ట్రస్థాయి పురస్కారాలకు ఎంపిక చేస్తామని చెప్పారు. అర్హులైన వారందరినీ గుర్తించి సత్కరించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిల ఆదేశాల మేరకు అధికార భాషా సంఘం అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తోందన్నారు. జిల్లా టూరిజం శాఖాధికారి నాగేశ్వరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భాషా, సాంస్కృతిక సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

మారనున్న 'అగ్రి' డివిజన్లు

- ఉమ్మడి జిల్లా పరిధిలో ఇప్పటి వరకూ 11 వ్యవసాయ సబ్‌డివిజన్లు
- కొత్తగా మరో మూడు చేరిక
- గుత్తి సబ్ డివిజన్ గుంతకల్లుకు మార్పు
- అనంతపురం జిల్లాలో 451, శ్రీసత్యసాయి జిల్లాలో 416 ఆర్‌బీకేలు


వ్యవసాయశాఖ జిల్లా కార్యాలయం

అనంతపురం అగ్రికల్చర్: పాలనాపరమైన సౌలభ్యం, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేసిన నేపథ్యంలో వ్యవసాయశాఖ సబ్‌డివిజన్లనూ శాసనసభ నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ప్రభుత్వం, వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో అధికారులు ఆ దిశగా సన్నాహక చర్యలు చేపట్టారు. జిల్లా విభజనలో భాగంగా 63 మండలాలను 'అనంత' పరిధిలో 31, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోకి 32 మండలాలను చేర్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పటికే అనంతపురం జిల్లాలో 451, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో 416 ఆర్‌బీకేలు గ్రామస్థాయిలోనే రైతులకు విశిష్ట సేవలందిస్తున్నాయి.

ఇప్పటికే 11 సబ్‌డివిజన్లు..

అనంతపురం జిల్లా పరిధిలో అనంతపురం, తాడిపత్రి, గుత్తి, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం కలిపి ఆరు వ్యవసాయ సబ్‌డివిజన్లు ఉండగా... శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో ధర్మవరం, హిందూపురం, పెనుకొండ, కదిరి, మడకశిర మొత్తం ఐదు సబ్‌డివిజన్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో ఇప్పటి వరకూ 11 వ్యవసాయ సబ్‌డివిజన్ల పరిధిలో పర్యవేక్షణకు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (ఏడీఏ) స్థాయి అధికారి ఉంటారు. ఇందులో అనంతపురం సబ్ డివిజన్ పరిధిలో ఆరు మండలాలు, గుత్తి డివిజన్‌లో ఐదు మండలాలు, కళ్యాణదుర్గం డివిజన్‌లో ఆరు మండలాలు, రాయదుర్గం డివిజన్‌లో ఐదు మండలాలు, తాడిపత్రి డివిజన్‌లో ఐదు మండలాలు, ఉరవకొండ సబ్ డివిజన్ పరిధిలో నాలుగు మండలాలు, ధర్మవరం సబ్ డివిజన్ కింద ఆరు మండలాలు, హిందూపురం డివిజన్‌లో ఐదు మండలాలు, కదిరి డివిజన్‌లో అత్యధికంగా 10 మండలాలు, మడకశిర డివిజన్‌లో ఐదు మండలాలు, పెనుకొండ సబ్ డివిజన్ పరిధిలో ఆరు మండలాలు ఉన్నాయి.

నియోజకవర్గం ప్రాతిపదికగా విభజన..

పాలనాపరమైన ఇబ్బందులను అధిగమించేందుకు తాజాగా నియోజకవర్గ కేంద్రం ప్రాతిపదికగా వ్యవసాయ సబ్‌డివిజన్ ఏర్పాటుకు కసరత్తు మొదలైంది. గతంలో ఒక నియోజకవర్గంలో ఉన్న ఒకట్రెండు మండలాలు మరో సబ్ డివిజన్‌కు చెందిన నియోజకవర్గ పరిధిలో ఉన్నందున రైతులకు, అధికారులకు కొన్ని సాంకేతిక పరమైన సమస్యలు, ఇబ్బందులు ఎదురవుతున్నట్లు గుర్తించారు. ఉదాహరణకు గుత్తి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని శింగనమల మండలం, అనంతపురం డివిజన్ పరిధిలోకి రాప్తాడు, కూడేరు మండలాలు, పెనుకొండ డివిజన్ పరిధిలోకి పుట్టపర్తి మండలం ఇలా... కొన్ని మండలాలు అటుఇటుగా ఉండడంతో ప్రోటోకాల్, ఇతర సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా మార్పునకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో కొత్తగా మూడు సబ్‌డివిజన్లు చేరి మొత్తంగా 14 సబ్‌డివిజన్లు కానున్నాయి. కొత్తగా శింగనమల, రాప్తాడు, పుట్టపర్తి వ్యవసాయ సబ్‌డివిజన్లు ఏర్పాటు కానున్నాయి. అలాగే గుత్తిలో ఉన్న సబ్‌డివిజన్ కార్యాలయాన్ని గుంతకల్లుకు మార్పు చేసే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. నియోజకవర్గ కేంద్రం శింగనమలలో కాకుండా అందరికీ అందుబాటులో ఉండేలా డివిజన్ కార్యాలయాన్ని నార్పలలో ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటికి ఆయా నియోజక వర్గ ప్రజాప్రతినిధులు ఆమోదముద్ర వేసినట్లు తెలుస్తోంది.

భూసార సంరక్షణ కేంద్రాలూ కుదింపు..

ఉమ్మడి జిల్లా పరిధిలో అనంతపురం, కళ్యాణదుర్గం, హిందూపురం, కదిరిలో వ్యవసాయశాఖ అనుబంధంగా భూసార సంరక్షణ కేంద్రాలు (సాయిల్ కన్సర్వేషన్ సెంటర్లు) పనిచేస్తున్నాయి. ఇందులో ప్రస్తుతం రెండు అనంతపురం, మరో రెండు శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోకి వెళ్లాయి. జిల్లాకు ఒకటి చొప్పున సంరక్షణా కేంద్రాలు ఉంచాలని కమిషనరేట్ నుంచి ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. నాలుగింటిలో రెండు కేంద్రాలను మూసివేయాలని ప్రతిపాదనలు కూడా వెళ్లాయి. అక్కడ పనిచేస్తున్న ఏడీఏ స్థాయి అధికారులు, సిబ్బందిని... నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు కానున్న సబ్ డివిజన్ కేంద్రాలు లేదా డీఏఓ కార్యాలయానికి అటాచ్ చేయనున్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

క్లుప్తంగా

హెచ్‌ఎం తీరుపై విచారణ

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధామణి వ్యవహార శైలిపై ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో సోమవారం ఉదయం జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఏడీ-1 నాగరాజు, సూపరింటెండెంట్ ప్రసాద్ విచారణ చేపట్టారు. ఇటీవల సుధామణి తీరుపై పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులందరూ కలెక్టర్ స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ సుధామణితో పాటు బోధన, బోధనేతర సిబ్బందిని విచారణాధికారులు వేర్వేరుగా విచారణ చేశారు. దీనిపై తుది నివేదిక సిద్ధం చేసి కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



తాడిపత్రి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలోని పట్టాలపై 50 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి సోమవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న జీఆర్పీ ఎస్ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మద్యం మత్తులో చెరువులో పడి వ్యక్తి మృతి

చిలమత్తూరు: మద్యం మత్తులో చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని గుడిబండ తాలూకా ఉప్పరహళ్లికి చెందిన శంకరప్ప (50) పదేళ్లుగా చిలమత్తూరు మండలం పాతచామలపల్లిలో నివాసముంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన ఆయన భిక్షమెత్తుకుని జీవనం సాగించడం మొదలు పెట్టాడు. ఆదివారం సాయంత్రం చెరువు తూము వద్ద మద్యం సేవించి అక్కడే నిద్రించిన ఆయన మత్తులో నీటిలో తూలి పడి మృతి చెందాడు. సోమవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం అందివ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడికి నలుగురు కుమార్తెలు కాగా, రెండో కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి


రామిరెడ్డి(ఫైల్)

చిలమత్తూరు: మండలంలోని కొత్తచామలపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కోటమీద రామిరెడ్డి(50) సోమవారం మృతి చెందారు. 20 రోజుల క్రితం కనుమ సమీపంలో ద్విచక్ర వాహనంపై వస్తూ అదుపు తప్పి కింద పడిన ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కుటుంబసభ్యులు చేర్పించారు. సోమవారం పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కాగా, 10రోజుల క్రితమే ఆయన తల్లి కూడా మృతి చెందింది. రోజుల వ్యవధిలో కుటుంబంలోని ఇద్దరు చనిపోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక, చౌళూరు మధుమతిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతదేహానికి ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి


విద్యుత్ శాఖ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

ధర్మవరం: నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నూతన సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తోందని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఈ క్రమంలో ఆర్‌డీఎస్ఎస్ (రీవ్యాంప్‌డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం) కింద ధర్మవరం నియోజకవర్గంలో రూ.175కోట్లు వెచ్చించి 15 నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ధర్మవరంలోని తారకరామాపురంలో రూ.18లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన విద్యుత్ శాఖ సెక్షన్-2 కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఆర్‌డీఎస్ స్కీం కింద ప్రతి పల్లెకూ త్రీఫేస్ కరెంట్‌ను 24గంటలూ అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బత్తలపల్లి మండలంలో ముష్టూరు, మాల్యవంతం, ధర్మవరంలోని కేతిరెడ్డి కాలనీ, కేశవనగర్, ముదిగుబ్బ మండలంలో కొండగట్టుపల్లి, గుంజేపల్లి, బీడీమర్రి, నల్లచెర్లోపల్లి, మంగళమడక, కొడవండ్లపల్లి, చిన్నకోట్ల, మర్తాడు, తాడిమర్రి మండలంలో పిన్నదర్రి, చిల్లకొండయ్యపల్లి గ్రామాల్లో నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ఇప్పటికే సర్వే పూర్తయిందన్నారు. అంతేకాక శిథిలావస్థలో ఉన్న తీగలు, విద్యుత్ స్తంభాలను మార్చి కొత్తవాటిని ఏర్పాటు చేస్తామన్నారు. గత టీడీపీ ప్రభుత్వహయాంలో ఒక్క సబ్‌స్టేషన్‌ను నిర్మించిన పరిస్థితి లేదన్నారు. హెచ్‌వీడీఎస్ పథకంలో రైతులు లంచాలు ఇవ్వలేదన్న ఉద్దేశ్యంతో గత టీడీపీ ప్రభుత్వం ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వకుండా రైతులను నాలుగేళ్లపాటు ఇబ్బందులకు గురి చేసిందని గుర్తు చేశారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన ఈ నాలుగున్నరేళ్ల వ్యవధిలో రూ.150కోట్ల దాకా హెచ్‌వీడీఎస్ పథకానికి ఖర్చు పెట్టి రైతులందరికీ తక్కువ ధరకు ట్రాన్స్‌ఫార్మర్లను పారదర్శకంగా అందించానని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్‌చైర్మన్ వేముల జయరామిరెడ్డి, వైస్ ఎంపీపీ రావులచెరువు ప్రతాప్‌రెడ్డి, డీఈ నాగేంద్ర, ఏఈలు కొండారెడ్డి, నాగభూషణ, జానకిరామయ్య, కౌన్సిలర్‌లు చందమూరి నారాయణరెడ్డి, కడప రంగస్వామి, నాయకులు చాంద్‌బాషా, మట్టిద్దుల కేశవరెడ్డి, ఈశ్వర రంగ తదితరులు పాల్గొన్నారు.

2005 దాడి కేసులో నిందితుల అరెస్ట్


పోలీస్ స్టేషన్ వద్ద మాట్లాడుతున్న మాజీ నక్సలైట్ల బంధువులు

పావగడ: తిరుమణి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటమ్మనహళ్లి (ఎగువపల్లి) గ్రామ ప్రభుత్వ పాఠశాలలో 2005, ఫిబ్రవరి 10న బస చేసిన జవాన్ల శిబిరంపై నక్సలైట్లు జరిపిన బాంబుల దాడి కేసులో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను పావగడ రూరల్ సీఐ గిరీష్, అరసికెర ఎస్ఐ తారాసింగ్ సోమవారం వెల్లడించారు. జవాన్ల శిబిరంపై నక్సలైట్లు జరిపిన దాడిలో ఏడుగురు జవాన్లతో పాటు ఓ పౌరుడూ మృతి చెందారని గుర్తు చేశారు. ఈ కేసులో నిందితులు ఉన్న శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం గంతిమర్రి నివాసి గొల్ల నాగరాజు, తల్లిమడుగుకు చెందిన బోయ రామమోహన్, బోయ ఓబులేసు, కోనేటినాయుని పాళ్యం నివాసి బోయ అంజినప్ప, కోనాపురానికి చెందిన పద్మావతిని సోమవారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్టు వివరించారు.

రాజకీయ కక్షతోనే అరెస్ట్ చేయించారు..

రాజకీయ కక్షతోనే తమ వారిని రామగిరి మండలానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు అరెస్ట్ చేయించారని పోలీసుల అదుపులో ఉన్న మాజీ నక్సలైట్ల బంధువులు ఆరోపించారు. తాలూకా పరిధిలోని వెంకటమ్మనహళ్లి వద్ద 2005లో జవాన్ల శిబిరంపై దాడి చేసిన ఘటనకు సంబంధించి అనుమానితులుగా ఉన్న నలుగురు మాజీ నక్సలైట్లను (రామగిరి మండలానికి చెందిన) పావగడ పోలీసులు సోమవారం అరెస్ట్ చూపించి, రిమాండ్‌కు తరలించారు. అంతకు ముందు రామగిరి మండల వైఎస్సార్‌సీపీ నేత నరసింహులు, తదితర బంధువులు సోమవారం పావగడలోని పోలీస్ స్టేషన్‌కు చేరుకుని తమ వారితో మాట్లాడారు. అనంతరం స్టేషన్ ఎదుట వారు విలేకరులతో మాట్లాడుతూ... కేవలం వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు కావడం వల్లనే కుట్రతో తమవారిని అరెస్ట్ చేయించారని మండిపడ్డారు. 19 ఏళ్ల క్రితం జరిగిన సంఘటనకు సంబంధించి ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో అరెస్ట్ చేయించడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందన్నారు. దీని వెనుక రామగిరి మండల టీడీపీ నాయకుల హస్తముందని ఆరోపించారు. ఎలాంటి వివాదాలు, విబేధాలు లేకుండా సేద్యం పనులు చేసుకుంటూ బతుకుతున్న తమ వారిని అన్యాయంగా అరెస్ట్ చేయించడం బాధాకరమన్నారు.

జనవాక్కు

ఆర్థిక ఇబ్బందులు తీరాయి



కూలి పనులతో జీవనం సాగిస్తున్న మాకు జగన్ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలిచింది. ఇటీవల నా భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ పోషణ భారమై, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నాకు వితంతు పింఛన్ మంజూరు చేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదుకుంది. వైఎస్సార్ చేయూత పథకం కింద ఏటా రూ.18,750 అందుతోంది. పేదలకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌కు ఎంతో రుణపడి ఉన్నాం. మళ్లీ ఆయనే సీఎం కావాలని కోరుకుంటున్నాం.

– జయమ్మ, మధూడి, అగళి మండలం

లక్షాధికారిని చేశారు



కూలి పనికి పోతే తప్ప పూట గడవదు. భర్త వదిలేసి పోయాడు. ఓ కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సొంత ఇల్లు లేదు. అద్దె ఇంట్లోనే కాలం నెట్టుకొస్తున్నాం. కొడుకు బేల్దారి పనికి వెళ్లి నాలుగు డబ్బులు సంపాదించుకుని వస్తే ఆ పూట గడుస్తుంది. పెద్దమ్మాయికి మాటలు రావు. మతిస్థిమితం లేదు. చిన్నమ్మాయికి పెళ్లి చేశా. కొడుకు కూడా పెళ్లి చేసుకుని వేరు కాపురం పెట్టాడు. దీంతో పెద్దమ్మాయి బాగోగులు చూడాల్సిన బాధ్యత నాపై పడింది. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత మా బతుకులు బాగుపడ్డాయి. పండమేటిరాయుడి ఆలయ సమీపంలో నా పేరుతో స్థలం మంజూరు చేసి, ఇల్లు కట్టిస్తున్నారు. ఇప్పుడా ఇల్లు రూ.10 లక్షలు విలువ చేస్తుంది. నన్ను లక్షాధికారిని చేశారు. ఆర్థిక ఇబ్బందులు తీరాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మేము ఎంతో రుణపడి ఉన్నాం.

– పామల్ల సంజమ్మ, రాప్తాడు

కొడుకును ఇంజినీర్‌ని చేశా...



మాది సాధారణ మధ్య తరగతి కుటుంబం. పిల్లలను ఉన్నత చదువులు చెప్పించాలంటే మా ఆర్థిక పరిస్థితి సరిపోదు. ఇలాంటి పరిస్థితిలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన దీవెన పథకాలతో మా కుమారుడు దామోదర్ రెడ్డి బీటెక్ పూర్తి చేశాడు. జగనన్నే కనుక సాయం అందించకపోతే నాలాగే నా కుమారుడు కూడా కూలి పనులతో జీవనం సాగించాల్సి వచ్చేది. ఈ రోజు వాడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడంటే అదంతా జగనన్న చలువే. వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రూ.13,500 వస్తోంది. ఎలాంటి సిఫారసు లేకుండా ప్రభుత్వ పథకాలు ఇంటి దగ్గరకే అందుతున్నాయి. ప్రభుత్వం మారితే సంక్షేమ పథకాలు ఆగిపోతాయి. అందుకే ఎవరెన్ని కుట్రలు చేసినా మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌నే ఎన్నుకోవాలి.

– చిన్న ఓబిరెడ్డి, గొందిరెడ్డిపల్లి, రాప్తాడు మండలం

జన నినాదం 'క్విట్ ఎల్లో బ్యాచ్'

- యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్



అనంతపురం కార్పొరేషన్: క్విట్ ఎల్లో బ్యాచ్ అనేది జనం నినాదమైందని, ఈ క్రమంలో రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేనకు రాజకీయ సమాధి కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ అన్నారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. 14 ఏళ్ల సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రజలకు ఎలాంటి మేలు చేయలేదన్నారు. గత ఎన్నికలకు ముందు టీడీపీ మేనిఫెస్టోలో 600 హామీలను ప్రకటించిన చంద్రబాబు అందులో ఏ ఒక్క హామీనూ నెరవేర్చకపోవడంతో పాటు పార్టీ వెబ్‌సైట్ నుంచి ఆ మేనిఫెస్టోను మాయం చేశారన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టోను వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తూచా తప్పకుండా అమలు చేశారన్నారు. మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చిన సంస్కరణలన్నీ రానున్న కాలంలో సమస్యలు లేని సమాజం ఏర్పాటుకు దోహదపడతాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఉరవకొండలో ఈ నెల 7న జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం అయితే, ఆ యాత్రకు ప్రజలు రాలేదని ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు.

తెలుగు ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెబుతాం

- ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయ్‌బాబు


చైర్మన్ విజయ్‌బాబు దంపతులను సన్మానించిన దేవదాయ శాఖ సిబ్బంది

లేపాక్షి: తెలుగు ప్రాముఖ్యతను ప్రపంచ దేశాలకు చాటి చెప్పేలా ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయ్‌బాబు తెలిపారు. సోమవారం ఉదయం లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన అనంతరం ఏపీ టూరిజం అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచెప్పేలా సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో పలు జిల్లాల్లో సాహితీ సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే మంగళవారం అనంతపురంలో అనంత సాహిత్య వేదిక పేరుతో సదస్సు ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ఇందులో కవులు, రచయితలు, సాహితీ వేత్తలకు పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

లేపాక్షిని యునెస్కో గుర్తించాలి..

విజయనగర రాజుల కాలం నాటి చిత్ర, కళాఖండాలకు నిలయమైన లేపాక్షిని యునెస్కో గుర్తించాలని రాష్ట్ర అధికార భాష సంఘం అధ్యక్షుడు విజయబాబు పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఆయన కుటుంబ సభ్యులతో ఆలయాన్ని సందర్శించారు. వీరికి ఆలయ కార్యనిర్వహణ అధికారి నరసింహమూర్తితో పాటు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని దుర్గాదేవి, వీరభద్రస్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ దంపతులను దేవాదాయ శాఖ సిబ్బంది సత్కరించారు. తహసీల్దార్ బాబుతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సరి'కొత్త' పాలన


జేఎన్‌టీయూ(ఏ) నూతన పాలకభవనం

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) నూతన పాలక భవనాన్ని గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ శనివారం వర్చువల్‌గా ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీంతో సోమవారం నుంచి పాలన వ్యవహారాలు నూతన భవనం నుంచే వర్సిటీ అధికారులు చేపట్టారు. పాత భవనం నుంచి కొత్త భవనంలోకి ఫర్నీచర్ మొత్తం మార్చారు. వీసీతో పాటు రెక్టార్, రిజిస్ట్రార్ పాలన బాధ్యతలు కొత్త భవనం నుంచే నిర్వర్తిస్తున్నారు. రాయలసీమకే తలమానికంగా ఉన్న జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్‌లో రూ. 36.77 కోట్ల వ్యయంతో ఇటీవల నూతన పాలక భవనాన్ని నిర్మించారు. మొత్తం 11 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో పాలక భవనం అందుబాటులోకి వచ్చింది.

16 సంవత్సరాల అనంతరం పాలక భవనం..

జేఎన్‌టీయూ (ఏ) 2008లో ఏర్పాటైంది. తొలినాళ్లలో అల్యూమ్ని గెస్ట్ హౌస్‌లో పరిపాలన కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఇంజినీరింగ్ కళాశాల సెంట్రల్ లైబ్రరీ భవనంలోకి మార్పు చేశారు. అప్పటి నుంచి అదే భవనం నుంచే పాలనా వ్యవహారాలు చక్కబెడుతూ వచ్చారు. అన్ని కార్యాలయాలు ఇదే భవనంలోనే ఏర్పాటయ్యాయి. తాజాగా నూతన పాలక భవనం అందుబాటులోకి రావడంతో కళాశాల ఓ క్యాంపస్‌లో, పాలక భవనం మరో క్యాంపస్‌లో వేర్వేరుగా ఉన్నాయి. కళాశాల క్యాంపస్‌లో ఉండే ఎంబీఏ కళాశాలను నూతన పాలక భవనం వెనుక వైపు ఉండే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లోకి మార్పు చేయనున్నారు. ప్రస్తుతం ఈ స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ఉండే భవనంలో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పరిపాలన కార్యాలయం ఉంది. దీనిని ఈ ఏడాది ఏప్రిల్‌లోపు జంతలూరు వద్ద ఉన్న శాశ్వత క్యాంపస్‌లోకి మార్పు చేయనున్నారు. అనంతరం మేనేజ్‌మెంట్ ఆఫ్ బిజినెస్ స్కూల్‌ను స్కిల్ డెవలప్‌మెంట్ భవనంలోకి మార్పు చేస్తారు.

'పోలీస్ స్పందన'కు 45 వినతులు


అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ విష్ణు

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 45 వినతులు అందాయి. అడిషనల్ ఎస్పీ విష్ణు స్వయంగా వినతులు స్వీకరించారు. బాధితులతో మాట్లాడి సమస్య తీవ్రత తెలుసుకున్నారు. చట్టపరిధిలోని సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు.

నమ్మించి మోసం చేశాడంటూ వాపోయిన కానిస్టేబుళ్లు..

సహోద్యోగే తమను నమ్మించి మోసం చేశాడని, ఎలాగైనా తమకు న్యాయం చేయాలంటూ ఏఎస్పీ విష్ణు ఎదుట పలువురు కానిస్టేబుళ్లు వాపోయారు. ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. వివరాలు... హిందూపూరం, చిలమత్తూరు పోలీస్‌స్టేషన్లలో కానిస్టేబుళ్లుగా నాగేంద్రప్రసాద్, గోవర్దన్ పనిచేస్తున్నారు. ఈ క్రమంలో వీరికి హిందూపురంలోని ట్రాఫిక్ కానిస్టేబుల్ మంజునాథ్, రియల్ ఎస్టేట్ వ్యాపారి భాస్కర్‌తో పరిచయం ఏర్పడింది. మంజునాథ్ మాటలు నమ్మి సోమందేపల్లి వద్ద సర్వే నంబర్ 93-4 లో 40సెంట్ల భూమిని సెంట్ 90 వేలతో 2018లో కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించి రూ.8 లక్షలు చెల్లించి అగ్రిమెంట్ కూడా చేసుకున్నారు. ఇటీవల ఆ స్థలంలోకి వెళితే యజమాని అడ్డుకున్నాడు. దీనిపై మంజునాథ్‌ను ప్రశ్నిస్తే ఆ స్థలం కాకుండా మరో స్థలాన్ని చూపించాడు. దీంతో తాము మోసపోయినట్లుగా గుర్తించిన నాగేంద్రప్రసాద్, గోవర్దన్... తమ సొమ్ము వెనక్కు ఇవ్వాలంటూ మంజునాథ్‌ను నిలదీశారు. ఇదిగో... అదిగో అంటూ సంవత్సరాలు గడిచిపోయినా డబ్బు చెల్లించడం లేదని, ప్రజల ఆస్తులను కాపాడే తమకే రక్షణ లేకుండా పోవడం బాధాకరంగా ఉందని ఏఎస్పీ ఎదుట బాధిత కానిస్టేబుళ్లు వాపోయారు.

'అనంత'కు ఎన్ఎస్ఎస్ రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డులు

అనంతపురం: జాతీయ సేవా పథకం రాష్ట్ర స్థాయి ఉత్తమ వలంటీర్ అవార్డులను ప్రకటించారు. అవార్డులకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని జి.నందిత, జేఎన్‌టీయూ(ఏ)పరిధిలోని రైపర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ యూనిట్-1 బి.నాగసుభ, కడపలోని కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి డి.సంతోష్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జె.సురేష్‌బాబు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 12న విజయవాడలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో అవార్డులు అందుకోనున్నారు.

ఇజ్రాయిల్‌లో ఉద్యోగావకాశాలు

పుట్టపర్తి టౌన్: నిర్మాణ రంగంలో నిరుద్యోగులకు ఇజ్రాయిల్ దేశంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధిసంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం సోమవారం తెలిపారు. ప్లాస్టరింగ్, సిరామిక్, బిల్డింగ్ ఫ్రేమ్ వర్క్, ఐరన్ బిల్డింగ్ వంటి టెక్నాలజీస్‌పై ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఆయన వివరించారు. 21 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు కలిగి, ఎనిమిది ఆపై తరగతులు చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. భవన నిర్మాణ రంగంలో మూడేళ్ల అనుభవం తప్పనిసరి అన్నారు. ఎంపికైన వారికి వసతి, వెళ్లేందుకు ప్రయాణ ఖర్చు, ట్యాక్స్ డిడక్షన్ వంటి సౌకర్యాలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న వారు 99888 53335, 93986 43930లో సంప్రదించాలన్నారు.

బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

బత్తలపల్లి: బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు డీఆర్‌డీఏ- వైకేపీ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ సుదర్శన్‌రాజు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక భారతి మండల సమాఖ్య కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.... అభ్యర్థులు తప్పనిసరిగా నర్సింగ్ డిగ్రీ పూర్తి చేసి 20 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. జర్మనీలో పని చేసేందుకు సుముఖంగా ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు భాషా డొమైన్ వంటి ఇతర నైపుణ్యాలపై జేఎన్‌టీయూ (కాకినాడ)లో ఉచితంగా శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్న వారు మరింత సమాచారానికి 77021 00238, 91823 16114లో సంప్రదించాలని కోరారు.

సౌత్‌జోన్ జట్టులో అనంత క్రికెటర్లు




తన్మయి కార్తీక్‌రెడ్డి, కిరణ్‌కుమార్, సంజయ్

అనంతపురం: జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు అండర్-14 సౌత్‌జోన్ క్రికెట్ జట్టులో చోటు దక్కించుకున్నారు. గుంటూరులోని పేరేచర్లలో ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకూ అండర్-14 ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. ఈ క్రమంలో జట్టును ఎంపిక చేయగా నార్పలకు చెందిన కె.సంజయ్, అనంతపురానికి చెందిన తన్మయి కార్తీక్‌రెడ్డి, టి.కిరణ్‌కుమార్‌కు చోటు దక్కింది. ఎంపికైన క్రీడాకారులను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మధు ఆచారి అభినందించారు.